సాక్షి
చిత్తూరు
మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



పకడ్బందీగా విద్యార్థుల వివరాలు

జిల్లాలో గత రెండేళ్లలో పదో తరగతి ఫెయిలైన విద్యార్థుల వివరాలను పకడ్బందీగా సేకరించాలని డీఈఓ, ఏపీసీ ఆదేశించారు. - 8లో



వైభవం.. వరసిద్ధుడి పుష్పపల్లకీ సేవ

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారికి సోమవారం వేకువజామున పుష్పపల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	24
తిరుపతి	35	25
తిరుమల	30	21
గూడూరు	37	26
నగరి	36	25

న్యూస్‌రీల్

దసరాఉత్సవాలకు రా రండి!



కలెక్టర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న సహాయ కమిషనర్ ఏకాంబరం, ఈఓ చంద్రమౌళి

చిత్తూరు కలెక్టరేట్ : బోయకొండ గంగమ్మ దేవస్థానంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు రావాలని కోరుతూ జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఏకాంబరం, ఆలయ ఈఓ చంద్రమౌళి ఆహ్వాన పత్రిక అందజేసి, పిలిచారు. వారు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే బోయకొండ గంగమ్మ దసరా ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్వో రాజశేఖర్‌కు మర్యాదపూర్వకంగా ఆహ్వానపత్రికలను అందజేశారు.

పల్లెలకు 24 గంటల విద్యుత్



భూమిపూజ చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

బంగారుపాళెం: పల్లెలకు 24 గంటలు విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని కేజీ సత్రం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేయనున్న లైన్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి గ్రామానికి నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తద్వారా గ్రామాల్లో స్వయం ఉపాధి కింద కుటీర పరిశ్రమలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇందులో భాగంగా గ్రామాలకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ లైన్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈలు హరి, లక్ష్మి, ఏడీ కొండయ్య, ఏఈలు రామిరెడ్డి, తనికవేల్, సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

51 మందికి ఉద్యోగోన్నతులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 51 మంది వీఆర్వో, జూనియర్ అసిస్టెంట్‌లకు ఉద్యోగోన్నతులు కల్పించారు. ఉద్యోగోన్నతుల కోసం ఎదురు చూస్తున్న వారికి ఉన్నతాధికారులు తీపికబురు వినిపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యోగోన్నతుల కసరత్తు పకడ్బందీగా చేపట్టారు. కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు కసరత్తును పర్యవేక్షించారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న వీఆర్వో, జూనియర్ అసిస్టెంట్‌లకు ఉద్యోగోన్నతులు లభించాయి. 51 మందిలో 18 మంది జూనియర్ అసిస్టెంట్ కేడర్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌కు, 33 మంది వీఆర్వో కేడర్ నుంచి సీనియర్ అసిస్టెంట్ కేడర్‌కు ఉద్యోగోన్నతి పొందనున్నారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో చిత్తూరు జిల్లాకు 25 మందిని, తిరుపతి జిల్లాకు 16 మందిని, అన్నమయ్య జిల్లాకు 10 మందిని నియమించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

మహిళా వర్సిటీలో జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఐపీటీ డిజిటల్ క్లాస్ రూమ్‌లో సోమవారం డీబీటీ బిల్డర్ ప్రాజెక్ట్ టీమ్–1, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ సంయుక్తంగా ఐదు రోజుల హ్యాండ్లింగ్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంటల్ అనిమల్స్ అన్న అంశంపై జాతీయ వర్క్‌షాపు ప్రారంభమైంది. ఇందులో వీసీ భారతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఔషధాల ప్రయోగాల్లో జంతువుల మీద పరిశోధనలు చేసేటప్పుడు అతి జాగ్రతలు పాటిస్తూ వాటికి ప్రాణహాని కలుగకుండా చూడాల్సిన అవసరముందన్నారు. పరిశోధన సమయంలో జంతువులను ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ సుజాతమ్మ, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ హెడ్ శైలజ, కోఆర్డినేటర్ శ్రీదేవి, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లు రజిత, ఇందిరా ముజీబ్, సుజాత పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం

ఉరుకుల పరుగుల జీవనం.. ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అలుపు లేని ప్రయాణం.. ఇందులో ఎదురయ్యే అతి ముఖ్యమైన సవాలు ఒత్తిడి. దీని ముందు ఎంతటి వారైనా ఓడిపోతున్నామని కుంగుబాటుకు గురవుతున్నారు. ఈ తరుణంలో ఆరోగ్యమే మహాభాగ్యమన్న పెద్దల నానుడి పక్కన పెడితే.. మానసిక ఆరోగ్యమే మహాభాగ్యమనే రోజులొచ్చేశాయి. మానసిక రుగ్మతలను ఎలా జయించాలి.. ఈ రుగ్మతలేవీ అన్న విషయాలపై నేడు ప్రపంచ మానసిక ఆరోగ్యదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



చికిత్స చేస్తున్న వైద్యులు



- వేధిస్తున్న మానసిక జబ్బులు
- ఏటా పెరుగుతున్న కేసులు
- ఆరోగ్యసూత్రాలే నివారణకు రక్ష
- నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

చిత్తూరు రూరల్: మానసిక కుంగుబాటు(డిప్రెషన్)..ఒత్తిడి(స్ట్రెస్).. ఈ రెండు మానసిక రుగ్మతలు. వీటిని మొగ్గలోనే తుంచి వేయాలి. లేదంటే అవి శారీరక వ్యాధులుగా రూపాంతరం చెందే ప్రమాదం ఉంది. విద్యార్థులు, యువత, ఉద్యోగులు, వివిధ రంగాల్లో పనిచేసే వారు ఏదో ఒక రూపంలో మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని సకాలంలో గుర్తించి వైద్యం చేయిస్తే మానసిక వ్యాధి నుంచి గట్టెక్కవచ్చంటున్నారు వైద్యులు.

వైఫల్యమే..రుగ్మతలకు కారణం

చదువులో రాణించలేకపోతున్నామని, పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత కాలేదని, ప్రేమ విఫలమైందని, ఆత్మీయులు దూరమయ్యారని, పచ్చని కాపురంలో కలతలు వచ్చాయని.. ఇలా వివిధ రకాలుగా ఎదురయ్యే ఒత్తిడి, వైఫల్యాలే రుగ్మతలకు కారణమవుతున్నట్లు పలు అధ్యయనాల్లో వెలుగు చూసింది.

చిత్తూరు జిల్లాలో ఓపీ వివరాలు

నెల	ఓపీల సంఖ్య
జూన్	642
జూలై	597
ఆగస్టు	699
సెప్టెంబర్	635

ఒంటరితనం శాపం


ఒంటరి తనం ఒంటికి మంచిది కాదన్నారు శ్రీశ్రీ. ఇది వందశాతం వాస్తవమని నేటి జీవన విధానం నిరూపిస్తోంది. అందరినీ మనం వదలివేస్తే అది ఏకాంతం. అందరూ మనల్ని వదిలేస్తే అది ఒంటరితనం అవుతుంది. నలుగురితో కలవకుండా ఎప్పుడూ ఏదో ఒకటి ఆలోచిస్తూ ఒంటిరిగా గడిపే వారికి అనేక అనర్థాలు పొంచి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మానసిక రోగి లక్షణాలివీ..

- చికాకు, కోపం, విసుగు, నిరుత్సాహం, నిస్సత్తువ, విరక్తితో ఉండడం.
- తనలో తాను మాట్లాడుకోవటం.
- ఒంటరిగా ఉండి నవ్వుకోవడం
- వ్యక్తిగత శ్రద్ధ తీసుకోకపోవడం
- చేసిన పనిని పదేపదే చేయడం
- అనవసరమైన ఆలోచనలతో ఆందోళన.
- అతినిద్ర, నిద్రలేమి.
- బరువు పెరగడం, తగడం.
- నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం
- ఏకాగ్రత లోపించడం, తనకు హాని చేస్తున్నట్లు ఊహించుకుని తగాదాలకు వెళ్లడం.
- తిరగబడి దాడి చేయడం తదితర లక్షణాలన్నీ మానసిక వ్యాధికి సూచికలు.

ఒత్తిడికి కారణాలు

- మానసిక రుగ్మత అనేది జన్యుపరంగా ఎక్కువగా వస్తుంది.
- మెదడులోని రసాయనాల సమతుల్యత దెబ్బతినడం.
- మెదడులో గడ్డలు ఏర్పడం.
- పుట్టుకతో మెదడు సరిగ్గా ఎదగకపోవడం
- ఫిట్స్ రావడం.
- మద్యపానం, దూమపానం.
- చదువు, ఉద్యోగాల్లో ఒత్తిళ్ల.
- నిద్రలేమి, తీవ్రమైన ఒత్తిడికి లోనవడం.
- పెద్దవారిల్లో మతిమరుపు, అన్నిరకాల లైంగిక సమస్యలతో మానసికంగా బాధపడడం.



చికిత్సే మందు

- ప్రతి వ్యాధిలాగానే ఈ జబ్బుకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు.
- మానసిక వ్యాధితో బాధపడుతున్న వారి విషయంలో నిర్లక్ష్యం వహించకూడదు.
- లక్షణాలు కనిపిస్తే అందుబాటులోని మానసిక వైద్య నిపుణులను సంప్రదించాలి.
- సకాలంలో డాక్టర్‌ను సంప్రదించి, చికిత్స చేయించుకోవాలి.
- ఈ వ్యాధికి సంబంధించిన అన్ని రకాల మాత్రలు, మందులు ప్రభుత్వాస్పత్రుల్లోనే అందుబాటులో ఉన్నాయి.
- డాక్టర్ల సూచనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకుని, వారి సూచనలు పాటించాలి.
- మూఢ నమ్మకాలు జోలికి వెళ్లకూడదు.
- ఈ రకమైన వైద్య సూత్రాలు పాటిస్తే సాధారణ వ్యక్తిలాగానే కొలుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. లేకుంటే ప్రాణాల మీదకు తెచ్చుకునే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న కేసులు

జిల్లాలో మానసిక వ్యాధి కేసులు ఏటా పెరుగుతున్నాయి. జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మూడేళ్ల కిందట మానసికవైద్య విభాగం ప్రారంభించారు. నలుగురు వైద్యులు, నలుగురు పీజీ డాక్టర్లు, సిబ్బంది మొత్తం 10 పనిచేస్తున్నారు. గతంలో రోజు కేవలం 5 నుంచి 10 వరకు మాత్రమే ఓపీలు వచ్చేవి. ప్రస్తుతం 20 నుంచి 30 వరకు వస్తున్నాయి. ఇటీవల కాలంలో మానసిక వ్యాధుల కేసులు పెరిగాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. డిప్రెషన్, యాంగ్జైటీ, స్కిజోఫ్రెనియా, ఓసీడీ వంటి కేసులను అధికంగా వస్తున్నట్లు వైద్యనిపుణులు వెల్లడిస్తున్నారు.

నేడు ర్యాలీ

ప్రపంచ మానసిక ఆరోగ్యదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం చిత్తూరు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి ప్రభావతీదేవి తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు అపోలో నర్సింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తామని ఆమె చెప్పారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆస్పత్రి సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆత్మహత్యలకు ప్రేరణ



మనిషి శారీరకంగా ఎంత ఆరోగ్యంగా ఉన్నా, మానసికంగా ప్రశాంతత లేకపోతే జీవన గమనం లయ తప్పుతుంది. పొరపాట్లకు అవకాశమిస్తుంది. దీర్ఘకాలిక రుగ్మతలకు దారి తీస్తుంది. విపరీత ఆలోచనలతో ఆత్మహత్యలకు ప్రేరేపిస్తుంది. ఇలాంటి సమయంలో సరైన అవగాహన కల్పించి, మెరుగైన చికిత్స అందించాలి. నిర్లక్ష్యం ఉండకూడదు. మనిషిలో వింత ప్రవర్తనలు కనిపించినా, పిల్లల్లో అనుకోకుండా పెనుమార్పులు వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– జయప్రియ, మానసిక వైద్య నిపుణులు

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



మానసిక వ్యాధి నివారణకు వ్యాయామాలు, మంచి పోషకాహారమే దివ్యౌషధం. దినచర్యలో భాగమైతే మానసికంగా దృఢత్వంగా ఉండొచ్చు. ఆరోగ్యకర జీవితాన్ని గడపొచ్చు. మంచి అలవాట్లు రుగ్మతలు దూరంగా ఉంచుతాయి. మంచి నిద్ర అంటే కనీసం 6 నుంచి 8 గంటలు పడుకోవాలి. ఒత్తిళ్లు లేని జీవితాన్ని గడపాలి. క్రమం తప్పకుండా రోజూ వ్యాయామం చేయాలి.

– దినేష్, మానసిక వైద్య నిపుణులు

బాబుకు ఎందుకు ఓటు వేయాలి?



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసినా ప్రజలకు ఒక మంచి పథకం అందించని చంద్రబాబుకు ఎందుకు ఓటు వేయాలి, ఏం ఒరగబెట్టారని ఆయన్ని అధికారంలోకి తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ప్రశ్నించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార దాహంతో పిల్లనిచ్చిన సొంత మామకు వెన్నుపోటు పొడిచి, సీఎం కుర్చీ లాక్కుని, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేడు 'నేను మారిపోయాను, నన్ను నమ్మండి' అంటూ ఊసరవెల్లి మాటలతో నమ్మించడానికి చూస్తున్నారని, ప్రజలు ఆయన్ని నమ్మే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. స్కిల్ పేరుతో ప్రజాధనాన్ని దోచేసినందుకు ఓటు వేయాలా?, 2014 ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు వందల హామీలను విస్మరించినందుకు ఓటు వేయాలా? పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేసినందుకా? ఓటుకు నోటు కుమ్మరించినందుకా? నీరు–చెట్టు పేరుతో ప్రజాధనాన్ని టీడీపీ నాయకులకు దోచిపెట్టినందుకు ఓట్లు వేయాలా? అని ప్రజలు మండిపోతున్నారని మంత్రి అన్నారు. 'నేను అమలు చేసిన సంక్షేమాలు అంది ఉంటేనే నాకు ఓటు వేయండి' అని అంటున్న దమ్ము ధైర్యం ఉన్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని అన్నారు. అందుకే ప్రజలు జగనన్నకు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. చంద్రబాబుకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5తో పాటు దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ఏకమై వచ్చినా జగనన్న సంక్షేమ పథకాల ముందు వారికి ఘోర పరాజయం తప్పదని ఆయన హెచ్చరించారు. ఆర్థిక నేరస్తుడిగా ముద్రపడి జైల్లో ఉంటున్న చంద్రబాబును ప్రజలు నమ్మబోరని, బాబుకు కోర్టులో చుక్కెదురేనని, టీడీపీ నాయకులు నిప్పు అంటున్న బాబు, నిప్పు కాదు తుప్పని కోర్టులు నిర్ధారిస్తున్నాయన్నారు. చంద్రబాబు చేసిన నేరాలను సీబీఐ ఒక్కొక్కటిగా బయటపెట్టి జీవితాంతం జైలుకే పరిమితం చేయబోతుందని చెప్పారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలకు అంకురార్పణ





అప్పలాయగుంటలో పుట్టమట్టిని ఊరేగింపుగా తీసుకొస్తున్న పండితులు, ప్రసన్న వెంకన్న ఆలయంలో మేదినీ పూజ చేస్తున్న ప్రధాన అర్చకులు

పుత్తూరు రూరల్: అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సేనాధిపతి ఊరేగింపు ఉత్సవాన్ని మేళతాళాల నడుమ మాడవీధుల్లో నిర్వహించారు. అనంతరం పుట్టమట్టిని ఆలయం నుంచి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, వేదపండితులు పుట్టమట్టిని మేదినీదేవి రూపంగా తీర్చిదిద్దారు. మేదినీదేవికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మహాగోపురం వద్ద వేదమంత్రోచ్చారణల నడుమ అంకురార్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. పవిత్రోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమాలను ఆలయాధికారి శివకుమార్ పర్యవేక్షించారు.

కీళపట్టులో..

గంగవరం: కీలపట్లలోని కోనేటిరాయస్వామివారి ఆలయంలో స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో సోమవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల నిర్వహణకు టీటీడీ వేద పండితులు, విజిలెన్స్ సిబ్బంది కీలపట్లకు విచ్చేశారు. కంకణం భట్రా భాస్కరాచార్యులు బృందం పర్యవేక్షణలో ఉదయం ఆలయంలో వేదపండితులు స్వామివారికి ఆరాధన, పుణ్యాహవచనం తదితర క్రతువులు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణం కార్యక్రమం చేశారు. స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి, హోమాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారి ఉత్సవాల్లో పాల్గొని తరించారు. టీటీడీ పాలక మండలి ఆదేశాల మేరకు ఆలయంలో స్వామివారి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు దేవరాజాచార్యులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించండి

- అర్జీలు రీ ఓపెన్ అయితే చర్యలు తప్పవు
- నిర్ణీత గడువులో ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి
- జిల్లా అధికారుల సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో ఆయా శాఖల జిల్లా అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందనలో నమోదయ్యే అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరిష్కారం కాని సమస్యలకు ఎందుకు కాలేదన్న విషయాన్ని అర్జీదారునికి వివరించాలని చెప్పారు. మీ–సేవ నగదు చెల్లింపులు పెండింగ్ లేకుండా ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత నగదు ప్రభుత్వ ఖాతాకు జమచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వివిధ రకాల సర్‌చార్జీలు ఆన్‌లైన్ విధానంలో తీసుకునేలా డిజిటల్ అసిస్టెంట్లకు ఆదేశాలివ్వాలని ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

చేదోడు ఈకేవైసీ పూర్తి చేయండి

జిల్లా వ్యాప్తంగా జగనన్న చేదోడు పథకం లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియను గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పథకానికి కొత్త దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో పకడ్బందీగా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్(పీడీఐ)లో జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో డివిజన్ మానిటరింగ్ కమిటీ, మండల స్థాయిలో డెటా వ్యాలిడేషన్ కమిటీకి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం (ఈ నెల 10న) శిక్షణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు శిక్షణకు కచ్చితంగా హాజరుకావాలని చెప్పారు. గైర్హాజరైతే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 14వ తేదీ లోపు గ్రామస్థాయి వ్యాలిడేషన్ డేటా, 21వ తేదీ లోపు మండల స్థాయి డేటా నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. డేటాను తప్పులు లేకుండా అప్‌లోడ్ చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు.

సంక్షేమ వసతిగృహాలను తనిఖీ చేయండి

జిల్లాలోని డివిజన్ స్థాయి అధికారులు సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యలు ఏవైనా ఉన్నట్లైతే సంబంధిత యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. మండలాలకు అదనంగా 300, మున్సిపాలిటీలకు అదనంగా 500 వసతి గృహ నిర్మాణాల మంజూరుకు పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వ భూములను వెంటనే గుర్తించాలని చెప్పారు. నియోజకవర్గాల వారీగా స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటుకు ఐటీఐ, డిగ్రీ కళాశాలలను గుర్తించాలని డీఆర్వోను ఆదేశించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డ్వామా పీడీ గంగాభవానీ, డీఆర్‌డీఏ పీడీ తులసి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 70,515 మంది స్వామివారిని దర్శించుకోగా.. 27,230 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

దివ్యాంగులకు జాబ్‌మేళా రేపు


శ్రీనివాస్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని విభిన్నప్రతిభావంతుల కోసం బుధవారం ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా విభిన్నప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా కేంద్రంలో ఉన్న ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ కాంపౌండ్ వద్ద ఈ నెల 11వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాలో పాల్గొనే వారు పదో తరగతి ఉత్తీర్ణత చెంది, 18–30 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. బధిరులు, అంధులు, శారీరక దివ్యాంగులు పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 93929 23884 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

స్పందనపై అలసత్వం వద్దు


సమస్యలు వింటున్న ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి

చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే ప్రతి ఫిర్యాదును విచారించాలని, ఈ విషయంలో అలసత్వం వద్దని ఏఎస్పీ సుధాకర్, చిత్తూరు ఎస్‌ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి హెచ్చరించారు. సోమవారం చిత్తూరులోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ సుధాకర్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. కుటుంబ తగాదాలు, ఆస్తి తగాదాలు, భూ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, పోలీసు సేవలపై ప్రజలు ఏఎస్పీకు వినతులు ఇచ్చారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గుడిపాల: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గుడిపాల మండలంలోని అడవిచేను గ్రామానికి చెందిన ఓ యువతి గుడిపాలలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఆదివారం సాయంత్రం ఆమె బాత్‌రూమ్‌కి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. అప్పటి నుంచి అన్ని చోట్ల వెతికినా ఎక్కడా దొరక్కపోవడంతో సోమవారం ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే చిత్తపార గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవం..వరసిద్ధుడి పుష్పపల్లకీ సేవ

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ముగిసిన స్వామివారి ప్రత్యేక ఉత్సవాలు


పుష్పపల్లకిలో ఊరేగుతున్న దేవదేవరులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వార్షిక ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేకువజామున స్వామివారికి శాస్త్రోక్తంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం రాత్రి తెప్పపై విహరించిన దేవదేవరులను వేకువజామున సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన పల్లకిలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో 21 రోజుల పాటు నిర్వహించిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాలు ముగిశాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సోమవారం స్వామివారి వార్షిక ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు ఆస్థాన మండపంలో కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులకు ఆలయ తాజా మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ప్రశంసాపత్రాలు అందజేశారు.

రూ 1.28 లక్షలు పలికిన వరసిద్ధుడి లడ్డూ

కాణిపాకం వినాయకస్వామివారికి నైవేద్యం పెట్టిన లడ్డూ వేలంలో రూ.1.28 లక్షలు పలికింది. కాణిపాకం సమీపంలోని అగరంపల్లెకు చెందిన చరణ్‌రెడ్డి వేలంలో స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. స్వామివారికి నైవేద్యంగా పెట్టిన 21 కిలోల లడ్డూను బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాల అనంతరం 21 రోజుల తరువాత వేలం వేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో సోమవారం ఉదయం 11 గంటలకు స్వామివారి ఆస్థాన మండపంలో లడ్డూను వేలం వేయగా అగరంపల్లెకు చెందిన చరణ్‌రెడ్డి దక్కించుకున్నారు. ఆయనకు ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి లడ్డూను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ జగన్నాథరెడ్డి, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, హేమమాలిని, సూపరింటెండెంట్లు కోదండపాణి, రవి, వాసు, ఉభయకర్తలు పాల్గొన్నారు.


చరణ్‌రెడ్డికి లడ్డూను అందజేస్తున్న ఆలయాధికారులు


ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఆలయ తాజా మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

చోరీ కేసులో నిందితుడికి జైలు

కుప్పం: పట్టణంలో మోటారు సైకిల్ చోరీ చేసిన కేసులో రిమాండ్‌లో ఉన్న నిందితుడికి 10 నెలలు జైలుశిక్ష విధిస్తూ కుప్పం కోర్టు జడ్జి తీర్పు చెప్పారని అర్బన్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. తంబిగానిపల్లెకు చెందిన దామోదరానికి చెందిన బజాజ్ పల్సర్ బైక్ చోరీ జరిగింది. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు పట్టణంలోని బాబయ్య మఠం ప్రాంతానికి చెందినా అబ్జల్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సాక్షాధారాలు పరిశీలించి, నేరం రుజువు కావడంతో అబ్జల్‌కు 10 నెలల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

వలంటీర్ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: మండలంలోని ఓబిరెడ్డిపల్లెకు చెందిన వలంటీర్ మల్లిక (24) సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై, ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగింది. ఈ విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు చికిత్సలు చేపట్టారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు విచారణ చేపట్టారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- స్పందన కార్యక్రమానికి 386 అర్జీలు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు


అర్జీదారుల సమస్య వింటున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్: స్పందనలో నమోదయ్యే వినతుల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొని, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు విచ్చేసిన ప్రజలు ఉన్నతాధికారులకు వినతులు ఇచ్చారు. అన్ని శాఖలకు సంబంధించి 386 అర్జీలు నమోదైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించారు

తమకిచ్చిన రెండెకరాల భూమిని ఆక్రమించారని వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లెకు చెందిన షికారీలు స్పందనలో అర్జీ అందజేశారు. 25 మందికి గతంలో రెండెకరాల భూమిని ఇచ్చారని, ఆ భూమిని కొందరు ఆక్రమించారన్నారు. సర్వే చేసి, న్యాయం చేయాలని కోరుతుంటే మండల అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

పొలాలకు దారి వసతి కల్పించాలి

పొలాలకు దారి సౌకర్యం కల్పించాలని బంగారుపాళెం మండలం బోడబండ్ల, కల్లూరిపల్లెకు రైతులు స్పందనలో అర్జీ అందజేశారు. వారు మాట్లాడుతూ చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంతో తమ పొలానికి వెళ్లేందుకు దారి సౌకర్యం లేకుండా పోయిందన్నారు. తమ సమస్యకు ఉన్నతాధికారులు పరిష్కారం చూపాలని వాపోయారు.

జీతాలు విడుదల చేయాలి

సమగ్రశిక్ష శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు పెండింగ్ జీతాలు వెంటనే మంజూరు చేయాలని బీజేపీ నేత చిట్టిబాబు స్పందనలో అర్జీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమగ్రశిక్ష శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదన్నారు. జీతాలు సకాలంలో మంజూరు కాకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ప్రైవేటు నయా దందాపై విచారణ

- రిజిస్ట్రేషన్ చేసుకోని ల్యాబ్‌లు, క్లినిక్‌లపై చర్యలు
- రెన్యూవల్ కానీ వాటిపైనా ఆరా

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్: అక్రమంగా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లపై జిల్లా యంత్రాంగం కొరడా ఝుళిపించనుంది. ఈనెల 2వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రైవేటు నయా దందా అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా యంత్రాంగంపై విచారణ చేపడుతోంది. అలాగే పోలీసు అధికారులు సైతం లోతుగా విచారిస్తున్నారు. చిత్తూరు నగరంలోని సుందరయ్యవీధిలోని 6 ఏళ్లుగా రిజిస్ట్రేషన్ చేసుకుండా నిర్వహిస్తున్న ఓ డెంటల్ క్లినిక్, పొన్నియమ్మగుడివీధిలో అనధికారంగా నడుపుతున్న ల్యాబ్‌పై పూర్తిస్థాయిలో విచారించారు. మరిన్ని క్లినిక్‌లు, ల్యాబ్‌లు కూడా రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్ గడువు మించినా పట్టించుకోవడం లేదని గుర్తించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్లినిక్‌లు, ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థులు


క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు రూరల్: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. సోమవారం పాఠశాలలో క్రీడాకారుల అభినందన సభ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన తిరుచానూరులో నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్–14, 17 బాల బాలికల బాక్సింగ్ పోటీల్లో వడమాలపేట క్రీడాకారులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. 38 కిలోల విభాగంలో లోకేష్, 50 కిలోల విభాగంలో జయసూర్య, 58 కిలోల విభాగంలో యూనస్ ప్రథమస్థానంలో నిలిచి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. నవంబర్ నెలలో విజయనగరం జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. హెచ్‌ఎం కరుణా నవనీతం మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మంచి ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు.

కాశిరాళ్ల పాఠశాలలో నెదర్లాండ్ దంపతుల విరాళం


నెదర్లాండ్ వృద్ధ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలను నెదర్లాండ్ దంపతులు సోమవారం సందర్శించారు. ఇక్కడి గణిత ఉపాధ్యాయుడు కనకాచ్చారి మిత్రుడు డాక్టర్ పిట్ క్రూసింగ్ తరపున పరిచయం అయిన నెదర్లాండ్ వృద్ధ దంపతులు క్రూసింగ్, గ్లాండ్ సోమవారం పాఠశాలకు విచ్చేశారు. వారు విద్యార్థులకు క్రీడా పరికరాలు వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బ్యాట్స్, జావలిన్ త్రోర్లు, నెట్స్(సుమారు రూ.10 వేలు విలువ) అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మురళీధర్ రెడ్డి, వాణి, భాస్కర్ రెడ్డి, మదనమోహన్ రెడ్డి, భారతి, సుల్తాన్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బంగారుపాళెం: కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడి తిరుపతిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు. ఏఎస్‌ఐ కథనం మేరకు.. తవణంపల్లె మండలం ముట్టుకూరు పంచాయతీ రామానాయుడుపాళేనికి చెందిన దైవప్రసాద్‌నాయుడు(66) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై బంగారుపాళెం మండలం వజ్రాలపురం బోయకొండ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అరగొండ అపోలో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.


ప్రతినిధుల సభలో జిల్లా నేతలు

విజయవాడలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశంలో జగనన్న ఆశీర్వాదం తీసుకుంటున్న మంత్రి ఆర్‌కే రోజా, సమావేశంలో ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తదితరులు

నర్సింగ్ కోర్సుల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ గ్రాంట్ సహాయంతో తిరుపతిలో నడుపుతున్న రాస్ ఎస్‌ఎంయూ శిక్షణ కేంద్రంలో ఉచిత నర్సింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో రెండేళ్ల కాలపరిమితి గల ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్ కోర్సు శిక్షణకు ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థినులు అర్హులని పేర్కొన్నారు. చిత్తూరు, అనంతపురం జిల్లా వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తిగల వారు ఈనెల 31వ తేదీలోపు ఎస్.వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శి, రాస్, తిరుపతి చిరునామాకు దరఖాస్తులు పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8179769449, 9494685529 ను సంప్రదించాలని ఆయన కోరారు.

పకడ్బందీగా విద్యార్థుల వివరాలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు, సమావేశంలో పాల్గొన్న ఎంఈఓలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు

- 11వ తేదీలోపు నిర్ణీత నమూనాలో వివరాలు తప్పనిసరి
- డ్రాపౌట్స్ సంఖ్య తగ్గింపునకు చర్యలు
- డీఈఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా గత రెండు విద్యాసంవత్సరాల్లో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలను పకడ్బందీగా సేకరించాలని డీఈఓ విజయేంద్రరావు, సమగ్ర శిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం డీఈఓ కార్యాలయంలోని సమావేశమందిరంలో ఎంఈఓలు, సమగ్ర శిక్ష శాఖ ఎంఐఎస్ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో 5– 18 ఏళ్ల మధ్యలో బడిమానేసిన విద్యార్థులను బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు వలంటీర్ల సహకారంతో ఆధార్‌డేటా ఆధారంగా బడిమానేసిన వారిని గుర్తించినట్లు తెలిపారు. వారందరినీ బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈఓలు నిత్యం తనిఖీలు చేయాలన్నారు. ప్రతి నెలా పాఠశాలల సందర్శన డైరీ వివరాలను డీఈఓ కార్యాలయానికి కచ్చితంగా పంపాలని తెలిపారు. జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గత రెండేళ్లలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలను సంబంధిత ప్రొఫార్మాలో సేకరించాలన్నారు. ఈ నెల 11వ తేదీ లోపు ఆ వివరాలను మండలాల వారీగా జిల్లా కార్యాలయానికి పంపాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పది, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల నుంచి ఫీజులు కట్టించి, వారిని ఉత్తీర్ణత చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

డ్రాపౌట్స్ తగ్గింపునకు పకడ్బందీ చర్యలు

జిల్లా వ్యాప్తంగా 4,075 మంది సిస్టమ్, స్కూల్ డ్రాపౌట్స్ ఉన్నట్లు ఏపీసీ తెలిపారు. సిస్టమ్ డ్రాపౌట్స్ 1,090, స్కూల్ డ్రాపౌట్స్ 2,985 మంది ఉన్నట్లు చెప్పారు. తవణంపల్లె, రామకుప్పం, పెనుమూరు, చౌడేపల్లె, సోమల, గుడిపాల, రొంపిచెర్ల మండలాల్లో సిస్టమ్ డ్రాపౌట్స్, చిత్తూరు, జీడీ నెల్లూరు, గుడిపాలలో స్కూల్ డ్రాపౌట్స్ ఎక్కువగా ఉన్నారన్నారు. ఆ సంఖ్యను తగ్గించి బడిఈడు పిల్లలు బడిలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి విద్యార్థి స్టూడెంట్ ఐడీ యాక్టివ్‌గా ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి, డీఈఓ కార్యాలయ సిబ్బంది జయప్రకాష్, సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.